నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 21 సెప్టెంబర్ 2024 | HYDERABAD

# 23న పలు ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్



సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా ఫేజ్-3 రింగ్ మెయిన్ -1 పరిధిలోని ప్రశాసన్‌నగర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు పలు ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. వీటిని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు జలమండలి అధికారులు ప్రకటించారు. ఈ పనులు ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం 6 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. దీంతో 24 గంటల పాటు పలు రిజర్వాయర్ల పరిధిలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. హకీంపేట, గోల్కొండ. టౌలిచౌకీ, లంగర్ హౌజ్, షేక్‌పేట, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, మాదాపూర్, కొండాపూర్, డోమెన్స్, గచ్చిబౌలి ప్రాంతాల ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని అధికారులు కోరారు.



ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల శుక్రవారం భారీ వర్షం కురిసింది. బన్సీలాల్ పేటలో అత్యధికంగా 7.43 సెం.మీ, చిలుకానగర్‌లో 6.60, గన్‌ఫౌండ్రి 6.58, నాంపల్లి 6.48, నాచారం, బేగంబజార్ 5.98, జవహర్‌నగర్, ముషీరాబాద్ భోలక్‌పూర్ 5.80, ఖైరతాబాద్ 5.55, విఠల్‌వాడిలో 5.53 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. -సిటీబ్యూరో



డే కేర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

# అరుదైన వ్యాధిగ్రస్తులకు ఆశాదీపం

## నిమ్స్‌లో డే కేర్ సెంటర్ ప్రారంభం

## 85 మంది రోగులకు చికిత్స

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20 : అరుదైన వ్యాధిగ్రస్తులకు నిమ్స్ ఆశాదీపంగా నిలుస్తున్నది. జన్యుల్లో మార్పులు జరిగి అరుదైన వ్యాధులతో పిల్లలు జన్మిస్తారు. అలాంటి వారికి పూర్తి స్థాయిలో చికిత్సలు ఉండవు. ఈ నేపథ్యంలో వారిని అనుక్షణం పర్యవేక్షిస్తూ చికిత్సలు అందించాల్సి ఉంటుంది. నిమ్స్ దవాఖానలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడికల్ జెనెటిక్స్ విభాగంలో అరుదైన వ్యాధులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ డీఎన్‌ఏ, ఫింగర్ ప్రింటింగ్, డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఈ కేంద్రం పనిచేస్తుంది. ఈ ప్రత్యేక కేంద్రాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్, డాక్టర్ చరణ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

### మూడు బెడ్లు.. నిష్ణాతులైన వైద్యులు

నిమ్స్ దవాఖానలో మెడికల్ జెనెటిక్స్ విభాగం ఎదురుగా ఉన్న వార్డులో మూడు బెడ్లను ఏర్పాటు చేశారు. మెడికల్ జెనెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ షగున్ అగర్వాల్, అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్ పర్యవేక్షణలో రోగులకు చికిత్స అందిస్తారు. రోగి పూర్తిగా ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అరుదైన వ్యాధిగ్రస్తుల కోసం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చికిత్స సమయాన్ని కేటాయించారు. మొత్తం 85 మంది రోగులు చికిత్స తీసుకుంటుండగా, వారిలో పదేండ్ల లోపు వారే ఉన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో వచ్చి చికిత్స తీసుకొని వెళ్తుంటారు. వ్యాధిగ్రస్తుల నుంచి సేకరించిన రక్త, ఇతర నమూనాలను సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌కు పంపిస్తారు. వారి సహకారంతో పిల్లలకు వచ్చిన అరుదైన వ్యాధి ఏ రకమైందో నిర్ధారించి, దాని అనుగుణంగా వాడాల్సిన మందులను సైతం నిర్ణయిస్తారు.

### రోగులకు రూ.50 లక్షల వరకు ఆర్థిక సాయం

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 2021లో రేర్ డీసీజ్ చికిత్స కోసం నేషనల్ పాలసీని రూపొందించింది. నిర్ణీత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ , మెడికల్ జెనెటిక్స్ విభాగాల్లో రోగులకు ఉచిత వైద్య చికిత్స అందించే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించారు. అరుదైన వ్యాధిగా నిర్ధారణ జరిగిన తర్వాత రోగులకు ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఒక్కో రోగి చికిత్సకు కేటాయిస్తారు. ఇప్పటి వరకు 55 అరుదైన వ్యాధులకు గుర్తింపు లభించగా, ఆయా రోగులకు పూర్తిగా ఉచితంగా చికిత్స అందిస్తారు.



# విలీన గ్రామాలపై హైడ్రా పిడుగు

## 51 పంచాయతీలపై పెత్తనం చెలాయించనున్న హైడ్రా

## ఇటీవలే ఓఆర్ఆర్ లోపలి పంచాయతీలపై ఆర్డినెన్స్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ లోపలి విలీన గ్రామాలపై హైడ్రా పిడుగు పడనున్నది. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి 51 గ్రామ పంచాయతీలు ఇటీవల గ్రేటర్‌లో విలీనమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 3వ తేదీన ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో హైడ్రాకు మంత్రి మండలి అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లోని ప్రస్తుత అన్ని విభాగాలకు ఉన్న అధికారాలను హైడ్రాకు కట్టబెట్టింది. దీంతో ఇటీవలే రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలపై హైడ్రా ఉక్కుపాదం మోపే అవకాశం ఉన్నదన్న ఆందోళనలు మొదలయ్యాయి. చెరువుల రక్షణ పేరుతో ఇప్పటివరకు హైడ్రా జరిపిన కూల్చివేతలన్నీ దాదాపుగా మున్సిపాలిటీల పరిధిలోనే జరిగాయి. ఇకపై విలీన గ్రామ పంచాయతీల్లోనూ బుల్డోజర్లు కనిపిస్తాయన్న చర్చ మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న 'విలీన' నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలు గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు హైడ్రాకు అప్పగించడంతో ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కుంటలు, చెరువుల చుట్టూ ఇండ్లు నిర్మించుకున్నవారు వణికిపోతున్నారు. హైడ్రా ఎప్పుడు వస్తుందో, తమ ఇల్లు ఎప్పుడు కూల్చుతుందో.. అని ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లూ ఏదైనా సమస్య ఉంటే స్థానికంగా ఉండే సర్పంచ్‌కు, పాలకవర్గానికి చెప్పుకునేవారిమని, ఇప్పుడు మున్సిపాలిటీల్లో విలీనంతో తమకు ప్రజాప్రతినిధులు దూరమయ్యారని వాపోతున్నారు. దీంతో స్థానిక సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు హైడ్రా వస్తే తమ సమస్యలను ఎవరూ పట్టించుకుంటారని వారు వాపోతున్నారు.

### ఇటీవల విలీనమైన గ్రామాల జాబితా ఇలా..



**రంగారెడ్డి జిల్లా**

| మున్సిపాలిటీ | విలీనమైన గ్రామాలు |
| --- | --- |
| పెద్ద అంబర్‌పేట<br>శంషాబాద్ | బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట్<br>బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ , చిన్న గోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘన్సీమియాగూడ. |
| నార్సింగి | మీర్జాగూడ . |
| తుక్కుగూడ | హర్షగూడ. |

**మేడ్చల్ జిల్లా**

| మున్సిపాలిటీ | విలీనమైన గ్రామాలు |
| --- | --- |
| మేడ్చల్ | పూడూరు, రాయిలాపూర్. |
| దమ్మాయిగూడ | కీసర, యాద్‌గార్‌పల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల్, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి. |
| నాగారం<br>పోచారం | బోగారం, గూడంకుంట, కరీంగూడ, రాంపల్లి, ద్యార వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ. |
| ఘట్‌కేసర్ | అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం, ఎదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ. |
| గుండ్లపోచంపల్లి | మునీరాబాద్, గౌడవెల్లి . |
| తూంకుంట | బొమ్మరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ . |

**సంగారెడ్డి జిల్లా**

| మున్సిపాలిటీ | విలీనమైన గ్రామాలు |
| --- | --- |
| తెల్లాపూర్<br>అమీన్‌పూర్ | కర్ధనూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘనాపూర్.<br>ఐలాపూర్, ఐలాపూర్ తండా, సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, ద్యార. |

# టెండర్.. వండర్!

## జీహెచ్ఎంసీ ఖజానాకు గండికొట్టే యత్నం

## మాన్‌సూన్ పనులను వినాయక ఉత్సవంలో జరిపినట్లు చూపించే ప్లాన్

## చేయని పనులకు బిల్లులు పెట్టి అందినంత దండుకునేలా ఎత్తుగడ

## కాంట్రాక్టర్లతో అధికారుల మిలాఖత్

## బెడిసి కొట్టిన వ్యూహం

## మల్కాజిగిరి సర్కిల్‌లో వెలుగులోకి అక్రమాలు

## చాలా సర్కిళ్లలో అవినీతి జరిగిందంటున్న కార్పొరేటర్లు

## కమిటీ వేసి.. సమగ్ర విచారణకు డిమాండ్

ఒక చేతితో చప్పట్లు రావు.. పనుల్లో ఒక్క కాంట్రాక్టర్ లాలూచీ పడితేనే అవినీతి జరగదు..అధికారి కూడా కలిస్తేనే అది పరిపూర్ణమవుతుంది.. ఖజానాకు గండిపడుతుంది.. జీహెచ్ఎంసీలో ఇంజినీరింగ్ విభాగం తీరు ఇలాగే ఉంది. కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయిన అధికారులు..మాన్‌సూన్ పనులను వినాయక ఉత్సవాల కింద చేపట్టినట్లు బిల్లులు చూపించి.. అందినంత దండుకునేందుకు పావులు కదిపారు. అనుకున్న విధంగా జరిగి ఉంటే.. ఖజానాకు భారీ 'టెండర్' పడేది. అయితే మల్కాజిగిరి సర్కిల్‌లో అక్రమాలు వెలుగులోకి రావడంతో అవినీతిపరులు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. అయితే చాలా సర్కిళ్లలో ఇలాంటి అవినీతి జరిగిందని కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక కమిటీ వేసి..సమగ్ర విచారణ చేపట్టి..చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


-సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ )

**గణేశ్ శోభాయాత్ర** ఈ నెల 17న ఆనందోత్సాహాల నడుమ ప్రశాంతంగా ముగిసింది. వాస్తవంగా శోభాయాత్ర జరిగే మార్గాల్లో ముందస్తుగా రహదారులపై గుంతలు లేకుండా చూడటం, ఉన్న ప్యాచ్‌వర్క్‌ను పూర్తి చేయడం వంటి పనుల బాధ్యత ఇంజినీరింగ్ విభాగానిదే. ఇందుకోసం ఒక్కో సర్కిల్‌కు దాదాపు రూ. 80 లక్షల మేర బడ్జెట్ ప్రతిపాదనలను కమిషనర్ ఆదేశాల ప్రకారం జోనల్ కమిషనర్లు ఆమోదం తెలిపారు. ఈ సమయంలో శోభాయాత్రను దృష్టిలో ఉంచుకొని రెండు రోజుల ముందుగానే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు చేపట్టాలి. కానీ డివిజన్ నంబర్ 28 విభాగం అధికారులు టెండర్ 12న పిలిచి 17న టెండర్‌ను తెరిచి.. ఏజెన్సీకి పనులు అప్పగించేందుకు ప్లాన్ చేశారు. ఇక్కడే శోభాయాత్ర 17వ తేదీ కంటే రెండు రోజుల ముందుగానే టెండర్ ప్రక్రియను ముగించి పనులు పూర్తి చేయాలి. 12న 24 గంటల వ్యవధితో షార్ట్ టెండర్ పిలిచే అవకాశం ఉంది. కానీ అధికారులు ఆరు రోజుల వ్యవధితో టెండర్ పిలిచి ఏజెన్సీని ఖరారు చేశారు. నాలుగు చోట్ల పనులకు రూ. 76.80 లక్షల వ్యయంతో టెండర్‌ను ముగించారు. షార్ట్ టెండర్‌ను ఒక్క రోజులో ముగించి 14వ తేదీలోగా సంబంధిత వర్క్‌ను ఎగ్జిక్యూషన్‌లోకి తీసుకురావాల్సిన చోట అవినీతికి తెరలేపారు. ఇందుకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ పనులను ఎంచుకున్నారు.




### వచ్చే వారంలో బిల్లు పెట్టి..

వర్షాకాల సీజన్ కావడంతో ఈ బడ్జెట్‌లో కేటాయించిన పనులను వినాయక ఉత్సవాల పనుల కింద బిల్లులను చూపించి.. అందినంత దండుకునేందుకు పావులు కదిపారు. మాన్‌సూన్ సీజన్ పనులు చేస్తున్న కాంట్రాక్టరే ఈ వినాయక ఉత్సవాల పనుల టెండర్ దక్కించుకోవడంతో అవినీతిని అధికారులు సులువుగా మలుచుకున్నారు. వచ్చే వారంలో ఈ బిల్లులు పెట్టి ఖజానాకు భారీ స్థాయిలో కన్నం వేయాలని భావించగా, వాళ్ల వ్యూహం బెడిసికొట్టింది.




### విచారణ జరిపించాలి..

ఒక్క మల్కాజిగిరి సర్కిల్‌లోనే కాదు జీహెచ్ఎంసీ పరిధిలోని ఇతర సర్కిళ్లలోనూ ఇదే రీతిలో చేయని పనులకు బిల్లులు పెట్టి దండుకునేందుకు రంగం సిద్ధం చేశారు. కాగా, వినాయక ఉత్సవాల సందర్భంగా చేపట్టిన పనులన్నింటిపై కమిషనర్ విచారణ జరిపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక్క పాట్‌హోల్స్ పనుల్లోనే కాదు ప్రతి చెరువులో సుందరీకరణ, బేబీ పాండ్స్, లైట్ సిస్టం, క్రేన్స్, జేసీబీ సామగ్రి పేరుతో నిధులు పక్కదారి పట్టించారని, కమిషనర్ ఆమ్రపాలి జోక్యం చేసుకొని సమగ్ర విచారణకు ప్రత్యేక కమిటీ వేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు.



# 22 రకాల స్టెరాయిడ్స్ సీజ్

సిటీబ్యూరో: దేహదారుఢ్యం కోసం వినియోగించే స్టెరాయిండ్స్‌ను అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఓ దుకాణంపై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. రూ. 2 లక్షల విలువ చేసే 22 రకాల స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్టేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన రాకేశ్ కొండియా కోఠి ఈసామియాబజార్‌లో 'రాకేశ్ డిస్ట్రిబ్యూటర్స్'పేరుతో దేహదారుఢ్యానికి సంబంధించిన పలు రకాల ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. డీసీఏ అనుమతులు లేకుండా 22 రకాల స్టెరాయిడ్స్ ఔషధాలను జిమ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నాడు. డీసీఏ అధికారులు శుక్రవారం సదరు దుకాణంపై దాడులు జరిపి, స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన డాక్టర్ బోయిని శ్రీకాంత్‌యాదవ్ మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్‌లో 'శ్రీకాంత్ న్యూరో సెంటర్' పేరుతో హాస్పిటల్‌ను నిర్వహిస్తున్నాడు. అదే దవాఖానలో డీసీఏ అనుమతి లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపును సైతం నిర్వహిస్తున్నాడు. డీసీఏ అధికారులు హాస్పిటల్‌పై దాడులు జరిపి, రూ.1.01లక్షల విలువ చేసే ఔషధాలను సీజ్ చేశారు.

# బల్దియాలో ఫేషియల్ అటెండెన్స్



సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోనూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం 14 విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది (రెగ్యులర్, ఔట్ సోర్సింగ్) ముఖాన్ని సంబంధిత మొబైల్ బేస్డ్ యాప్‌లో ఐటీ విభాగం అధికారులు క్యాప్చర్ చేసి ..నమోదు చేశారు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పనిచేస్తుంది. 39 విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరుకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్‌ను సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం అడ్వర్టయిజ్‌మెంట్ అండ్ పబ్లిసిటీ, ఆడిట్/అకౌంట్స్ సెక్షన్, సీపీఆర్‌వో సెక్షన్, ఎలక్షన్ బ్రాంచ్, ఎస్టేట్ ఆఫీస్, ఫైనాన్స్ అకౌంట్స్ సెక్షన్, జనరల్ టాక్సేషన్, లేబర్ వెల్ఫేర్ సెక్షన్, ల్యాండ్ ఎక్విజేషన్, లీగల్ సెక్షన్ అండ్ మున్సిపల్ కోర్టు, సెక్రటరీ సెక్షన్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ కమిషనర్ ఆఫీస్, వెటర్నరీ, విజిలెన్స్ సెక్షన్ల అధికారులు, సిబ్బంది ముఖాన్ని క్యాప్చర్ చేసినట్లు అధికారులు చెప్పారు. శనివారం ఇంజినీరింగ్ విభాగం, ఐటీ, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, ఎస్‌ఎన్‌డీపీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇతర విభాగాల అధికారులు, సిబ్బందికి ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సోమవారం 23న మిగతా విభాగాల వారీగా ఫొటో క్యాప్చర్ చేయనున్నట్లు పేర్కొన్నారు. చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ అండ్ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, హెల్త్ సెక్షన్, ఫుడ్ సేఫ్టీ వింగ్, హాస్పిటల్స్ అండ్ డిస్పెన్సరీస్, లైసెన్స్ సెక్షన్, ప్రివెన్షన్ ఆఫ్ మలేరియా,యాంటీ మస్కిటో స్కీం , స్పోర్ట్స్, టౌన్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్, అర్బన్ బయోడైవర్సిటీ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరుకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంలో నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ విధానంతో పారదర్శకంగా, కచ్చితత్వంతో కూడిన హాజరు నమోదవుతుందన్నారు.

# గాంధీ జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు

## హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : మహాత్మా గాంధీ జయంతి వేడుకలను అక్టోబర్ 2న ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గాంధీ జయంతి ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్ వెంకటాచారి, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ కె.సతాను, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఆర్డీవో మహిపాల్, డీహెంహెచ్‌వో డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నగరంలో శుక్రవారం జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షా సెంటర్లను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. కోఠి మహిళా యూనివర్సిటీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

# షీ టీమ్స్‌కు చిక్కిన 996 మంది పోకిరీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): గణనాథుడి దర్శనం కోసం క్యూలైన్లలో నిల్చున్న మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పోకిరీలు షీటీమ్స్‌కు చిక్కారు. మొత్తం 11 రోజుల్లో 996 మంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని మహిళా భద్రత డీసీపీ కవిత వెల్లడించారు. ఖైరతాబాద్ బడా గణేశ్‌తో పాటు రద్దీగా ఉన్న ఇతర చోట్ల కూడా షీ టీమ్స్ నిఘా పెట్టిందని, పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేసి వీడియో, ఫొటోగ్రఫీ సాక్షాలతో కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. మరికొందరి వీడియో సాక్ష్యాలు సరిగా లేకపోవడంతో అలాంటి వారిని పట్టుకొని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌనెల్సింగ్ నిర్వహించి హెచ్చరించినట్లు వివరించారు. రౌండ్ ది క్లాక్ షీ టీమ్స్ మహిళా భద్రతపై దృష్టి పెడుతుందన్నారు. మహిళలు వేధింపులకు గురైతే భయపడకుండా షీ టీమ్స్, డయల్ 100కు వెంటనే ఫోన్ చేయాలని సూచించారు.

# కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలి

## ఏఐటీయూసీ డిమాండ్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 20: గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు రోజు వారీ గిరాకీ లేదని, దీంతో రాష్ట్రంలో ఉన్న 7 లక్షల మంది ఆటోడ్రైవర్ల కుటుంబాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రైవేట్ ఫైనాన్షియర్ల వద్ద రుణాలు తీసుకుని ఆటోలను కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12వేలు, ఈఎస్ఐతో పాటు ఆటో, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏండ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పింఛన్లు ఇవ్వడంతో పాటు యాక్సిడెంటల్ బీమా రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. ఈ నెల 22, 23 తేదీల్లో కొత్తగూడెం పట్టణంలో జరిగే యూనియన్ 3వ మహాసభలకు డ్రైవర్లు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. అశోక్, నగర ప్రధాన కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం